

# అమెరి'కా'లేజ్

## - లిపి మల్లాది



*అమెరికాలో కాలేజీ చదువంటే ఒకప్పుడు గగనకుసుమం, అదో ఇంద్రజాలం. గత రెండు, మూడు దశాబ్దాల్లో అమెరికాలో చదువుకోసం వస్తున్న విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగడమే కాక, ఇండియాలో కూడా ఒక మాదిరిగా చదువుకున్న కుటుంబాల్లో దాదాపు ప్రతి ఇంటికీ కనీసం ఒకరైనా అమెరికాలో చదువుకుంటున్న పిల్లలుంటున్నారు. ఇంటర్నెట్ అరచేతిలోకొచ్చేసిన ఈ రోజుల్లో అమెరికాలో కాలేజీలు ఎలా ఉంటాయో, అక్కడ డార్మ్స్ ఎలా ఉంటాయి, స్టూడెంట్స్ జీవితాలు ఎలా ఉంటాయో... అనే విశేషాలు అతి సులువుగా తెలిసిపోతున్నట్లనిపిస్తున్నాయి. ఐనా మొదటిసారి చదువుకోసం అమెరికా వచ్చే ప్రతి విద్యార్థికీ ఎవరి అనుభవం వారిదే, ఎవరి ఇబ్బందులు వారివే, ఎవరి స్నేహాలు వారివే. ఈ నేపథ్యంలో అమెరికాలో చదువుకోసం వచ్చిన ఓ సాధారణ మధ్యతరగతి అమ్మాయికి ఎదురైన సంఘటనలు, సన్నివేశాలు.. స్నేహాలు, సంతోషాలు.. సరదాలు.. వెరసి ఇవన్నీ అమెరికాలేజీ కథలు. స్వానుభవాలనూ, విన్న అనుభవాలనూ, చూసిన అనుభవాలనూ - ఆసక్తికరమైన ధారావాహికగా కౌముది పాఠకులకు అందిస్తున్నది లిపి మల్లాది. 'నా కళ్ళతో నాన్న' ధారావాహికతో కౌముది పాఠకుల అభిమానాన్ని సొంతం చేసుకున్న లిపి మల్లాది ఈ ధారావాహికతో మీకు మరింత చేరువౌతుందని ఆశిస్తూ..*

*- సంపాదకుడు*

(కిందటి సంచికనుండి కొనసాగింపు)

**చూస్తూ చూస్తూ** సెమిస్టర్ పూర్తవ్వబోతుంది. రెండు పరీక్షలు రాస్తే ఇంక సెలవులే. చదువుకుంటూ తెలీకుండానే కాలం గడిచిపోయి థాంక్స్ గివింగ్ సెలవలు వచ్చాయి. అన్నయ్య చెప్పినట్టుగానే నాకు టికెట్ బుక్ చేసాడు. యదావిధిగా వెన్నెల నన్ను ఎయిర్‌పోర్ట్‌లో దింపితే, అన్నయ్య నన్ను ఇంటికి తీసుకెళ్ళాడు. దారి పొడుగూతా నేను హాలోవీన్ కథలు చెప్పాను. అన్నయ్య ఊ కొడుతూ విన్నాడు. ఇంటికి వెళ్ళే దారిలో ఆకలిగా అనిపించింది కానీ స్నానం చేసిన వెంటనే నిద్రపోయాను.

ఉదయం నేను లేచేసరికి అన్నయ్య కంప్యూటర్‌లో పని చేస్తున్నాడు.

"రాత్రి తినలేదే?" అడిగాడు.

"నిద్ర పట్టేసింది" బదులిచ్చాను.

"అదే అనుకున్నాను"

"ఇవాళ ఏం చేద్దాం?"

"ఇవాళ ఇంట్లోనే. నేను వర్క్ ఫ్రం హోం."

"ఓ, సరే. "నేను రీసర్చ్ పని చేసుకుంటా."

"నీకు హాలీడే కదా, పని ఎందుకు చెయ్యడం?"

"డిసెంబర్‌లో ప్రొఫెసర్‌కి ప్రెజంటేషన్ ఇవ్వాలి."

"ఓ అలాగా, సరే. రాత్రి డిన్నర్‌కి బయటకి వెళ్దాం"

"సరే."

మధ్యాహ్నం భోం చేసాక కంప్యూటర్ తెరిచాను. గంటకూడా పని చెయ్యకముందే బోర్ కొట్టి టీవి చూడసాగాను. కొద్దిసేపయ్యాక నా ఫ్రెండ్స్ పెట్టిన ఫోటోలని ఇన్‌స్టాగ్రాములో చూసి, వారిలో కొందరు కొలరాడోలో ఉన్నారని తెలుసుకుని మెసేజ్ పంపాను. వారితో దాదాపు గంట ఫోన్ మాట్లాడాక మర్నాడు కలుద్దాం అని నిశ్చయించుకున్నాము. డిన్నర్‌కి బయటకి వెళ్ళినప్పుడు అన్నయ్యకి ఆ విషయం చెప్పాను.

"ఇవాళ డిన్నర్‌కి పిలవాల్సింది" అన్నాడు.

"అవును కదా.తట్టలేదు"

"రేపు ఏం చేస్తారు?

"ఏమో. ప్లాన్ నాకు తెలీదు."

"కనుక్కుని నాకు చెప్పు. ఏదైనా సలహా ఇవ్వగలిగితే ఇస్తాను."

"సరే అడుగుతాను."

వాళ్ళకి మెసేజ్ పంపాను.

"వాళ్ళకి ఏం ప్లాన్ లేదట. మే బీ హైకింగ్ అంటున్నారు."

"ఈ చలిలో హైకింగ్ చేస్తే గడ్డగట్టిపోతారు"

"అవును. అయితే వేరే కేంప్ ఏదైనా చెద్దాం అని చెప్తాను."

"ఇన్‌డోర్స్ వెళ్ళండి. వాళ్ళకి మ్యూజియం నచ్చకపోవచ్చు. ఆర్కేడ్ గేమ్స్ లాంటి చోటుకి వెళ్ళండి."

"సరే. అంతే చేస్తా."

"నా క్రెడిట్ కార్డ్ తీసుకెళ్ళు, కానీ నీ ఫ్రెండ్స్‌కి కట్టకు."

"పర్లేదు. నా దగ్గర డబ్బులున్నాయి."

"నీవి దాచిపెట్టుకో. ఇక్కడ ఉన్నన్ని రోజులు నా క్రెడిట్ కార్డ్ వాడుకో."

"సరే, కానీ ఒక వేళ పోతే?"

"నీ డెబిట్ కార్డ్ ఎప్పుడైనా పారేసావా?"

"లేదు."

"మరి ఎందుకు భయం."

"ఏమో జాగ్రత్తగా చూస్తాలే."

అన్నయ్య నవ్వాడు.

"నా ఫ్రెండ్స్ మాల్‌కి కూడా వెళదాం అంటున్నారు."

"వెళ్ళు కానీ జాగ్రత్త. చాలా రష్ ఉంటుంది."

"హాలీడేస్ అనా?"

"కాదు సేల్స్ వల్ల."

"సేల్ అనే నా ఫ్రెండ్స్ వెళదాం అనుకుంటున్నారట."

"షాపింగ్ కోసం ఫ్లైట్ ఎక్కి మరీ వచ్చారా నీ ఫ్రెండ్స్." వెటకారంగా నవ్వాడు.

"మా ఊళ్ళో కొన్ని బ్రాండ్స్ దొరకవట. అందుకే ఇక్కడ అవి కొంటారట"

"నీ ఫ్రెండ్స్ చాలా ఇం ప్రాక్టికల్ ఎండ్ హై మెయింట్‌నెన్స్‌లా ఉన్నారు. జాగ్రత్తగా ఉండు వాళ్ళతో."

"సరే. కానీ అలా ఎందుకంటావు? వాళ్ళు మంచి వాళ్ళు."

"చెడ్డవాళ్ళని నేను అనట్లేదు. డబ్బు ఖర్చు ఎక్కువ పెట్టి, మీ ఊళ్ళో లేవని ఇక్కడ బ్రాండెడ్ బట్టలు కొనడం అంటే హై మెయింట్‌నెన్స్. స్టూడెంట్స్ సహజంగా అలా ఉండరు."

"వాళ్ళు సేల్ అనే కొంటున్నారు."

"అయ్యుండచ్చు. కానీ అదే సేల్‌లో మామూలువి ఇంకా తక్కువకి దొరుకుతాయి. వెయ్యి డాలర్లవి ఐదువందలకి కొనే బదులు పది డాలర్లవి ఐదు డాలర్లకి కొంటే స్టూడెంట్స్ రెంట్ హాయిగా కట్టుకోవచ్చు."

నిజమే అనిపించి తలూపాను.

"రేపు ఏ టైముకి వెళతారు?"

"మధ్యాహ్నం. వాళ్ళు పొద్దున లేవరు."

"లంచ్‌కి కలుస్తారా అయితే?"

"యా. అంతే."

"సరే. వాళ్ళని ఎక్కడో అడుగు. నేను డ్రాప్ చేస్తాను."

"వాళ్ళకి డ్రైవింగ్ బానే వచ్చా?"

"యా. బానే వచ్చు. రోడ్ ట్రిప్స్‌కి తరచూ వెళుతూ ఉంటారు."

"మీ ఇండియానాలాగా కాదు. ఇక్కడ ట్రాఫిక్ చాలా ఎక్కువగా ఉంటుంది."

"పర్లేదు. వాళ్ళకి అలవాటే."

అన్నయ్య నిశ్శబ్దంగా ఉన్నాడు.

"చుట్టాలు ఎవరితో అయినా మాట్లడావా?" అడిగాను.

"అమ్మమ్మ తప్ప ఎవరితో మాట్లాడలేదు."

"అవును కదా. నువ్వు ఎవరితో మాట్లాడవు."

"ఏం లాభం మాట్లాడి, ఆరాలు తీయడానికే ఫోన్ చేస్తారు."

"అయినా అందరూ అలా కాదు."

"మన చుట్టాల్లో అందరూ అంతే."

"మొన్న పిన్ని అందట అమ్మతో, మీవాడు మమ్మల్ని మర్చిపోయాడు. కనీసం నీకైనా ఫోన్ చేస్తున్నాడా అని."

అన్నయ్య పెద్దగా నవ్వి "అక్కడే తెలుస్తుంది ఆవిడ బుద్ధి. మీవాడు బానే ఉన్నాడా? ఉద్యోగం ఎలా ఉంది? అని నా గురించి కాక నీకైనా ఫోన్ చేస్తున్నాడా? అని ఆరా తీయడానికే ఫోన్ చేసుంటుంది."

నిజమే కదా అని కోపం కలిగింది.

ఇంటికి వెళ్ళే దారిలో యధావిధిగా నిద్రపోయాను.

ఉదయం లేచేసరికి పదిగంటలైంది. వెంటనే నా ఫ్రెండ్స్‌కి గంటలో రెడీగా ఉంటాను అని చెప్పి మెసేజ్ పంపాను. వెంటనే అన్నయ్యకి నేను రెడీ అవుతున్నా అని కేకేసాను.

నా ఫ్రెండ్స్ వచ్చాక నేను అన్నయ్యకి అందరినీ పరిచయం చేసాను. అన్నయ్య అందరితో భలే మాట్లాడాడు. నాకు ఎంతో గర్వంగా అనిపించింది. మేము చూసేందుకు కొన్ని సలహాలు ఇచ్చాడు. అలానే తినడానికి కూడా రెస్టారెంట్ పేర్లు చెప్పాడు. ఒకవేళ ఏదైనా అవసరం వస్తే ఫోన్ చెయ్యమన్నాడు. జాగ్రత్తగా నడపమని, నా చెల్లి బాధ్యత మీదే అంటూ సరదాగా వార్నింగ్ ఇచ్చాడు.

"యువర్ బ్రదర్ ఈజ్ సో కూల్"

"యువర్ బ్రదర్ ఈజ్ సో ఫ్రెండ్లీ."

"యువర్ బ్రదర్ ఈజ్ సో నైస్" అంటూంటే నాకు ఆనందంగా అనిపించింది.

అన్నయ్య చెప్పిన చైనీస్ రెస్టారెంట్‌లో మేము భోంచేసి మాల్‌కి వెళ్ళాము. అన్నయ్య చెప్పినట్టే కిటకిటలాడుతోంది. కొద్ది సేపయ్యాక నేను వాళ్ళని స్కీయింగ్‌కి తీసుకెళ్ళాను. ఆ తరవాత తెలీకుండానే రాత్రి ఎనిమిది అయ్యింది. అన్నయ్య అప్పుడు ఫోన్ చేసాడు. వెంటనే వంద సారీలు చెప్పాను. ఫరవాలేదని ఒక అడ్రెస్ పంపి అక్కడికి రమ్మన్నాడు. మేమంతా అన్నయ్య అడ్రెస్ పంపిన రెస్టారెంట్‌కి వెళ్ళాము.

అందరం మాట్లాడుతూ భోంచేసాము. అన్నయ్యే బిల్లు కట్టాడు.

తను మాస్టర్స్‌కి వచ్చిన కొత్తలో బ్లాక్ ఫ్రైడే సేల్‌కి జనాలు స్టోర్ ముందు లైన్‌లో ఎలా నిలబడేవాళ్ళో కథలు చెప్పాడు. అన్నయ్య మాట్లాడుతుంటే అందరం ఆశ్చర్యంగా విన్నాము.

వాళ్ళ కాలంలో ఆన్‌లైన్ షాపింగ్ అతి తక్కువగా ఉండేది అంటే కొంతమంది ఆశ్చర్యపోయారు. ఒక అమ్మాయి మాత్రం నమ్మలేదు. నా స్నేహితుల్లో ఒకతను ఆల్కాహాల్ ఆర్డర్ చెసినందుకు అన్నయ్య తిడతాడని భయపడ్డాను కాని ఒక్కమాట కూడా అనలేదు. ఎప్పటిలానే కారులో నిద్రపోయాను.

(కొనసాగింపు వచ్చే నెలలో)

Click here to share your comments on this story